

విద్యార్థులకు ప్రోత్సాహకాల అందజేత

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

ఈ నెల 13న జరిగిన సార్వత్రిక ఎన్నికల విధుల్లో పాల్గొన్న కళాశాల విద్యార్థులకు ఎస్‌పి ఎస్.శ్రీధర్ అందించిన ప్రోత్సాహకాలను శనివారం స్థానిక పోలీస్ స్టేషన్ అందజేశారు. ప్రశంసా పత్రాలు, రూ.500 నగదును అమలాపురం రూరల్ సిఐ, పి.వీరబాబు, ఎస్ఐ కెఎం.జోషి లు విద్యార్థులకు అందజేసి ఎన్నికల విధులను సక్రమంగా అందించారని అభినందించారు.



ప్రోత్సాహకం అందుకున్న విద్యార్థులతో సిఐ వీరబాబు, ఎస్ఐ జోషి

కౌంటింగ్ పారదర్శకంగా నిర్వహించాలి

- జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి హిమాన్షు శుక్లా

ప్రజాశక్తి-అమలాపురం

సాధారణ ఎన్నికలు -2024 సంబంధించి కౌంటింగ్ ప్రక్రియను అవగాహనతో పారద ర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారి హిమాన్షు శుక్లా ఓట్ల లెక్కింపు సిబ్బందికి సూచించారు. శనివారం స్థానిక ఎస్‌కెబిఆర్ కళాశాల నందు నమూనా ఓట్ల లెక్కింపు కేంద్రం ఏర్పాటు చేసి ప్రయోగాత్మకంగా ఓట్ల లెక్కింపు ప్రక్రియపై సంపూర్ణమైన అవగాహనను కౌంటింగ్ సిబ్బందికి కల్పించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటింగ్ ప్రక్రియలో భారత్ ఎన్నికల సంఘం పలు సంస్కరణలను తీసు కుని వచ్చిందని సాంప్రదాయ బ్యాలెట్ పేపర్ మాదిరిగా కాకుండా ఓట్ల లెక్కింపులో సమయాన్ని ఆదా చేయడానికి, ఎంతో క్లిష్టంగా ఉండే మాన్యువల్ లెక్కింపును తొలగించి ఎన్నికల సంఘం ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను అందుబాటులోనికి తెచ్చిందన్నారు. ప్రజాస్వామ్య దేశంగా ప్రసిద్ధిగాంచిన మన దేశం లో ఓట్ల లెక్కింపు ప్రక్రియలో ఖచ్చిత త్వాన్ని నిర్ధారించడానికి ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు ఎంతో ప్రాముఖ్య తను కలిగి ఉన్నాయన్నారు. ఆయా అసెంబ్లీ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు ప్రత్యక్ష పర్యవేక్షణలో కౌంటింగ్ అత్యంత పారదర్శకంగా ఎన్నికల సంఘం మార్గదర్శకాలు అనుగుణంగా స్పష్టతతో నిర్వహించాలన్నారు. ఈ నమూనా ఓట్ల లెక్కింపు కేంద్రంలో పోస్టల్ బ్యాలెట్, ఇవిఎంల ఓట్ల లెక్కింపుపై చేసిన ఏర్పాట్లను విశదీకరించారు.. డిఆర్‌డిఎ పీడీ జిల్లా శిక్షణల నోడల్ అధికారి వి.శివశంకర్ ప్రసాద్, రామచంద్రపురం ఆర్‌డిఒ ఎస్.సుధా సాగర్ లు కౌంటింగ్ సిబ్బందికి 40 మంది చొప్పున రెండు బ్యాచ్లలో 80 మందికి కౌంటింగ్ పై ప్రయోగాత్మకంగా శిక్షణ ఇచ్చారన్నారు. కంట్రోల్ యూనిట్లు ఓపెన్ చేయడం సీళ్ళు పరిశీలించి రిజల్ట్ నొక్కడం ద్వారా ఏ అభ్యర్థికి ఎన్ని ఓట్లు వచ్చింది పోలింగ్ ఏజెంట్ల సమక్షంలో నిర్వహించే ప్రక్రియ తీరును వారు ప్రత్యక్షంగా సిబ్బందికి విశదీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారి కౌంటింగ్ శిక్షణలో ఉన్న సిబ్బంది కౌంటింగ్ లో ఏ మేరకు అవగాహన కలిగి ఉన్నది ప్రశ్నించి అనంతరం కౌంటింగ్ ప్రక్రియలో శిక్షణలో ఉన్నవారి సందేహాలను ఆయన అడిగి తెలుసుకుని అక్కడికక్కడే నివత్తి చేశారు. ప్రతి అంశాన్ని సిబ్బంది పూర్తిగా ఆకలింపు చేసుకుని ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా అత్యంత స్పష్టతతో ఓట్ల లెక్కింపు ప్రక్రియను నిర్వహించాలని ఆయన స్పష్టం చేశారు ఎన్నికల సంఘం మార్గదర్శకాలను ఉల్లంఘిస్తే ఉపేక్షించేది లేదని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్ అజయ్, డిఆర్ఒ ఎం.వెంకటేశ్వర్లు, రిటర్నింగ్ అధికారులు ఎ.శ్రీరామ చంద్రమూర్తి, డివి ఎస్.ఎల్లారావు, వి.మదన్ మోహన్‌రావు, జి.కేశ వర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా

రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష

6 జూన్ వరకు అమలులో ఎన్నికల కోడ్: ఆర్‌డిఒ

ప్రజాశక్తి-రామచంద్రపురం

సార్వత్రిక ఎన్నికల ఫలితాలు ఈనెల 4న వెలువడనున్న నేపథ్యంలో ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులతో శనివారం రామచంద్రపురం ఆర్‌డిఒ కార్యాలయంలో ఆర్‌డిఒ సుధా సాగర్ సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో అన్ని పార్టీల నాయకులు సహకరించారని అదేవిధంగా కౌంటింగ్ సమయంలోనూ శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ఆయా పార్టీల నాయకులు సహకరించాలన్నారు. ఎన్నికల కోడ్ జూన్ 6 వరకు అమల్లో ఉంటుందని అందువేత ఏ విధమైన అల్లర్లు జరగకుండా రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని ఈ సందర్భంగా ఆయన విజ్ఞప్తి చేశారు. సమావేశంలో రామచంద్రపురం డిఎస్‌పి బి.రామకృష్ణ, సిఐ వి. దొరరాజు మాట్లాడారు. సమీపంలోని చెయ్యేరులో గల శ్రీనివాస ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల్లో కౌంటింగ్ జరుగుతుందని ఈ సందర్భంగా 144 సెక్షన్ అమల్లో ఉంటుందని వివరించారు. కౌంటింగ్ అనంతరం జరిగే విజయోత్సవ ర్యాలీలు, బాణసంచా కాల్చడం, రెచ్చగొట్టే పోస్టింగులు చేయడం వంటి వాటిని ఎవరు అతిక్రమించరాదని, ఎవరికి ఏ విధమైన అనుమతులు లేవని ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున తప్పనిసరిగా అన్ని పార్టీలు నిబంధనలను పాటించాలని వివరించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఎం.వెంకటేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు, అన్ని పార్టీల రాజకీయ నాయకులు ప్రతినిధులు సమావేశానికి హాజరయ్యారు.



మాట్లాడుతున్న రామచంద్రపురం ఆర్‌డిఒ సుధా సాగర్

ఖరీఫ్ సన్నద్ధతపై సమావేశం


ప్రజాశక్తి-అమలాపురం

అమలాపురం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శనివారం ఎంపిడిఒ బి.కృష్ణ మోహన్ అధ్యక్షతన గోదావరి వరద ముందస్తు జాగ్రత్తలు, ఖరీఫ్ వరి సాగుకు రైతులను సమాయత్తం చేయడం పై వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, విఆర్ఓలు, వ్యవసాయ సహాయకులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం లో ఎంపిడిఒ బి.కృష్ణ మోహన్ మాట్లాడుతూ జూన్ లోనే రుతు పవనాల ఆగమనంతో వర్షాలు భారీగా కురిసి మండలంలోని బోడసకుర్రు, గోపాయి లంక, గోడి, బెండమూరు లంక గ్రామాల్లో వైనతేయ కు వరద నీరు వచ్చే అవకాశం ఉందన్నారు. దీంతో ఏటి గట్టు పటిష్టత, ఎక్కడైనా గండ్లు పడే అవకాశాలు ఉన్నాయా అన్న అంశంపై సచివాలయం సిబ్బంది ద్వారా క్షుణ్ణంగా పరిశీలన చేయించి ఈ నెల 29వ తేదీ లోపు గ్రామాల వారీగా నివేదికలు ఇవ్వాలని కార్యదర్శులను, విఆర్‌ఒలను ఆదేశించారు. ఖరీఫ్ లో రైతులకు సాగు నీరు, మురుగు పారుదల ఇబ్బందులు లేకుండా ఆయకట్టు పరిధిలో వ్యవసాయ సహాయకులు, విఆర్‌ఒలు, లస్కర్లు అన్ని పంట కాలువలు, మురుగు కాలువలు పరిశీలించి గుర్రపు డెక్క తొలగింపు ప్రదేశాలను గుర్తించాలన్నారు. ఉపాధి కూలీలు ద్వారా తొలగించగలవి, జెసిబి ద్వారా తొలగించ వలసినవిగా రెండు జాబితాలు మే 31లోగా అందించాలన్నారు. రామేశ్వరంమొగ పూడిక తీత కోసం ప్రాథమిక పరిశీలన చేయాలని ఆదేశించారు. అల్లవరంలోని బుడంపేట, బోడసకుర్రు లోని కొన్ని ప్రాంతాలు వరద సమయంలో చానల్స్ లో నీరు గోదావరిలోకి వెళ్లక పోవడం వలన ముంపునకు గురవుతున్నందున ఈ సమస్యపై దృష్టి పెట్టాలని ఇరిగేషన్, డ్రైనేజ్ ఎఇలకు సూచించారు. ఖరీఫ్ సాగుకు రైతులను సమాయత్తం చేసేలా కార్యాచరణ ఉండాలని వ్యవసాయ అధికారికి సూచించారు ఈ సమావేశంలో ఎంపిడిఒ బి.కృష్ణ మోహన్, ఇరిగేషన్ ఎఇ రెహ్మాన్, ఎఇ సుచిత, ఎఇ సత్యనారాయణ, ఎంపిడిఒ కార్యాలయం ఎఒ లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీలు, బాణసంచా తయారీ, కాల్పులు నిషేధం

ప్రజాశక్తి-ఆత్రేయపురం

సార్వత్రిక ఎన్నికల పురస్కరించుకుని ఈసీ ఆదేశాల మేరకు జూన్ 4న ఎన్నికల ఫలితాలు వెలువడే నేపథ్యంలో మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లో భారీ ర్యాలీలు, ఊరేగింపులు, బాణసంచా తయారీ విక్రయాలు, కాల్పులు వంటి వాటిపై అనుమతులు లేవని ఎస్ఐ ఎస్.శ్రీనివాసు అన్నారు. ఆయన శనివారం పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. జూన్ 4వ తేదీన ఎన్నికల లెక్కింపులు అనంతరం గ్రామీణ ప్రాంతాల్లో భారీ ర్యాలీలు, సమావేశాలు, బాణసంచ తయారీ విక్రయాలు, కాల్పులు, వాటర్ బాటిల్స్ లో పెట్రోలు విక్రయాలు వంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదన్నారు. అలాగే ఎన్నికల కోడ్ అమలులో ఉన్న కారణంగా బహిరంగ ప్రదేశాలలో అల్లర్లు సృష్టిస్తు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.



ఎస్ఐ ఎస్.శ్రీనివాస్

ప్రధాన రహదారులు అధ్వానం

- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

అల్పపీడనం కారణంగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని పలు ప్రధాన రహదారులు అధ్వాన్నంగా మారాయి. దీంతో రహదారులపై ప్రయాణించే వాహన చోదకులు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారు. కొద్దిపాటి వర్షానికే రహదారులు ఇలా అధ్వానంగా మారిపోతే రానున్న వర్షాకాలంలో పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తున్నారు. కొన్నేళ్లుగా రహదారులను అభివృద్ధి చేయకపోవడమే దీనికి కారణంగా చెబుతున్నారు. ప్రధానంగా ఉప్పలగుప్తం- పేరాయిచెరువు, భట్నపాలెం, బి.వలసల సన్నవిల్లి-ఉప్పలి రహదారులపై గోతుల్లో వర్షపు నీరు నిలిచి రాకపోకలకు ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి మండలంలోని రహదారులను అభివృద్ధి చేసి రానున్న వర్షాకాలంలో ప్రయాణికులకు అవస్థలు లేకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



ఉప్పలగుప్తంలో రహదారిపై గోతులు

సప్లిమెంటరీ హిందీ పరీక్షకు 360 మంది గైర్హాజరు

ప్రజాశక్తి -ముమ్మిడివరం

పదవ తరగతి సప్లమెంటరీ హిందీ పరీక్షకు సంబంధించి జిల్లాలో 460 మంది విద్యార్థులు హాజరు కావలసి ఉండగా 100 మంది విద్యార్థుల పరీక్షలకు హాజరైనట్లు శనివారం డిఇఒ ఎం.కమల కుమారి తెలిపారు. జిల్లాలో వీరి కోసం 16 సెంటర్లు ఏర్పాటు చేయగా 100 మంది విద్యార్థుల పరీక్షకు హాజరు కాగా 360 మంది విద్యార్థులు గైర్హాజరు అయ్యారని అన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్ 10 పరీక్ష కేంద్రాల్లో తనిఖీలు చేయగా డిఇఒ ఎం.కమల కుమారి 3, పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ ఎం. సురేష్ 3 పరీక్ష కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించారు. కాగా ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల కేంద్రంలో 39 మందికి పరీక్షలు నిర్వహించగా 35 మంది గైర్హాజరయ్యారని ఎంఇఒ బి.రమణశ్రీ తెలిపారు.

ఉత్సాహంగా వేసవి శిక్షణా తరగతులు

ప్రజాశక్తి-యంత్రాంగం

జిల్లా పలుచోట్ల శాఖ గ్రంథాలయాల్లో శనివారం వేసవి శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు చిత్రలేఖన, వ్యాసరచన పోటీలు నిర్వహించారు.

రామచంద్రపురం: జిల్లా గ్రంథాలయాల శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు వేసవి శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా పట్టణంలో శాఖ గ్రంథాలయంలో లైబ్రేరియన్ దడాల వెంకటరమణ ఆధ్వర్యంలో 50 మంది విద్యార్థులు శనివారం వ్యాసరచన, చిత్రలేఖన పోటీల్లో పాల్గొన్నారు. లైబ్రేరియన్ మాట్లాడుతూ వేసవిలో విద్యార్థులకు ఉపయోగకరమైన విజ్ఞానాన్ని అందించేందుకు పుస్తక పఠనంపై మక్కువ పెంచేందుకు శిక్షణ తరగతులు ఉపయోగపడ తాయన్నారు. కార్యక్రమంలో కె.గంగవరం మండల అభివృద్ధి అధికారి ఎన్. శ్రీనివాస్, మండల విద్యాశాఖ అధికారి అలజంగి నాగరాజు, లైబ్రరీ సిబ్బంది, వనజాక్షి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆత్రేయపురం: విద్యార్థులకు పుస్తక పఠనం ద్వారా అధిక శిఖరాలను అధిరోహించవచ్చని గ్రంథాలయ అధికారి తమ్మ నమశ్శివాయ అన్నారు. గ్రంథాలయ వేసవి విజ్ఞాన శిబిరం కార్యక్రమంలో భాగంగా శనివారం ఆత్రేయపురం శాఖ గ్రంథాలయంలో వివిధ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. ముందుగా విద్యార్థులు అందరూ పుస్తక పఠనం చేశారు. అనంతరం గ్రంథాలయ నిర్వాహణ అధికారి తమ్మ నమశ్శివాయ విద్యార్థులకు నీతి కథలు, వేమన, సుమతి పద్యాలు తదితర పద్యాలను విద్యార్థులకు వివరించారు. అలాగే కాకి అందం అనే కథను విద్యార్థులు కు వివరించి చెప్పి మరల వారి నుంచి ప్రశ్నల రూపంలో ఈ కథలో ఉన్న జంతువుల పేర్లు, వాటి విశిష్ట గురించి అడగడం ద్వా రా విద్యార్థుల ఏకాగ్రతతో సమాధానాలు చెప్పాలని ఆయన పేర్కొన్నారు. రిటైర్డ్ ఉపాధ్యాయులు కె.రత్నం రాజు, తెలుగు భాష గురించి, దేశ భక్తి గీతాలు, పద్యాలు గురించి విద్యార్థులకు వివరించారు.



రామచంద్రపురంలో వేసవి శిక్షణ శిబిరం

నాడు-నేడు పనులను వేగవంతం చేయాలి

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

నాడు-నేడు పనులను వేగవంతం చేయాలని డిప్యూటీ కలెక్టర్ అండ్ సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఎ.మధుసూదనరావు పాఠశాలల హెచ్‌ఎంలకు సూచించారు. శనివారం కపిలేశ్వరపురం మండలంలోని మండలంలోని కపిలేశ్వరపురం, మాచర, కె.రాజుపాలెం, వాకతిప్ప గ్రామాల్లోని పాఠశాలల్లో చేపట్టిన నాడు-నేడు పనులను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మధుసూదనరావు మాట్లాడుతూ జూన్ 12న పాఠశాలలు పున్ర ప్రారంభం కానున్న నేపథ్యంలో పాఠశాలలను సిద్ధం చేయాలన్నారు. అదనపు తరగతి గదులు, టాయిలెట్స్, మేజర్ అండ్ మైనర్ పనులు, కిచెన్ షెడ్ తదితర పనులను పూర్తి చేయాలన్నారు. పనులను పూర్తి చేయడంతో పాటు ఎప్పటికప్పుడు పనుల ప్రగతిని ఆన్లైన్ చేయాలన్నారు. అనంతరం ఆయన విద్యా కానుక-5 మండల స్టాక్ పాయింట్‌ను పరిశీలించారు. విద్యా కానుక-5 పథకంలో వచ్చిన స్టాక్ ను పరిశీలించి పాఠశాలల వారీగా స్టాకు సిద్ధం చేయాలని సూచించారు. విద్యా కానుక-5 రిజిస్టర్ లను సిద్ధం చేసిఎప్పటికప్పుడు రిసీవ్డ్ స్టాక్ డీటేలు విద్యా కానుక యాప్ లో అప్డేట్ చేయాలన్నారు. ఆయన వెంట సమగ్ర శిక్షా కమ్యూనిటీ మొబిలైజేషన్ ఆఫీసర్ బీవీవీ సుబ్రమణ్యం, ఎంఎంఒ పి.రాంబాబు, ఎంఇఒ కె.తాతారావు, హెచ్‌ఎం ఎ.రాజు, ఎంఐఎస్ కోఆర్డినేటర్ సురేష్, సిఆర్‌ఎంటిలు, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది ఉన్నారు. **రామచంద్రపురం:** మండలంలో నాడు-నేడు పనులను సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఎ.మధుసూదనరావు శనివారం పరిశీలించారు. కె.గంగవరం మండలంలోని కోటిపల్లి జెడ్‌పి ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మధుసూదనరావు మాట్లాడుతూ జూన్ 12న పాఠశాలలు పున్ర ప్రారంభం కానున్నందున ఆ సమయానికి పనులను పూర్తి చేయాలన్నారు. అందుకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. విద్యుదీకరణ టాయిలెట్స్, మేజర్ అండ్ మైనర్ పనులు తదితరాలు చేపట్టాలన్నారు ఉపాధ్యాయులు వివరించారు. పనులను పూర్తి చేయడంతో పాటు ఎప్పటికప్పుడు పనుల ప్రగతిని ఆన్లైన్ లో అప్డేట్ చేయాలన్నారు. అంతకుముందు ఆయన విద్యా కానుక-5 మండల స్టాక్ పాయింట్ ను పరిశీలించారు. ఆయన వెంట సమగ్ర శిక్షా కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి బివివి.సుబ్రహ్మణ్యం, ఎంఎం. పి.రాంబాబు, సహిత విద్య జిల్లా కోఆర్డినేటర్ ఎంవివి.సత్యనారాయణ ఉన్నారు.



అంగరలో స్టాక్ రూమును పరిశీలిస్తున్న ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ మధుసూదన్ రావు

బాలబాలాజీ నిత్యాన్నదానానికి విరాళం అందజేత

ప్రజాశక్తి -మామిడికుదురు

అప్పనపల్లి శ్రీ బాల బాలాజీ స్వామి శాశ్వత నిత్యాన్నదాన ట్రస్టుకు దాత విరాళం అందజేశారు. విజయవాడకు చెందిన చిట్టూరి వినయ నాగశ్రీనివాసు, లక్ష్మీ దుర్గ దంపతులు పెళ్లి రోజు ప్రతి సంవత్సరం జూన్4న అన్నదానము జరిపించు నిమిత్తం రూ.11,116 శనివారం విరాళం ఇచ్చారని ఆలయ సహాయ కమిషనర్ గ్రంధి మాధవి తెలిపారు. ఆలయ అర్చకులు మరియు ఆలయ సిబ్బంది దాతదంపతులకు స్వామివారి చిత్రపటం, లడ్డు ప్రసాదం అందజేశారు.

స్వామి వారి ఆదాయం రూ.3.41లక్షలు

బాల బాలాజీ స్వామి దేవస్థానం నందు శనివారం లడ్డు ప్రసాదం విక్రయం, దర్శనము టిక్కెట్లు విక్రయం ద్వారా రూ.2,57,701 మరియు నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.83,667 వెరశి మొత్తం రూ.3,41,368 ఆదాయం వచ్చిందని సహాయ కమిషనర్ తెలిపారు స్వామి వారిని 4,693 మంది దర్శించుకోగా 3,856మంది అన్నప్రసాదం స్వీకరించారన్నారు.



దాతదంపతులకు స్వామి చిత్ర పటం అందజేస్తున్న సహాయ కమిషనర్ మాధవి

పారాలీగల్ వాలంటీర్ల నియామకానికి దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-ముమ్మిడివరం

ముమ్మిడివరం ఫస్ట్ క్లాస్ జూనియర్ కోర్టు పరిధిలో పారా లీగల్ వాలంటీర్లను నియామకానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఛైర్మన్ మరియు జూనియర్ సివిల్ జడ్జి మహమ్మద్ రహంతుల్లా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ముమ్మిడివరం, కాట్రేనికోన, ఐ.పోలవరం మండలాల్లో ఏదైనా కారణాలు వలన ప్రజలకు న్యాయ సేవలు అందించేందుకు పారా లీగల్ వాలంటీర్లను నియమిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. దీనికి పదో తరగతి ఉత్తీర్ణులైన ఉండాలన్నారు. 18 సంవత్సరాలు వయసు నిండినవారు పారా లీగల్ వాలంటీర్ సేవలు అందించేందుకు అర్హులని ఆయన అన్నారు. పారా లీగల్ వాలంటీర్ల నియామకానికి దరఖాస్తులను జూన్ 15వ తేదీ లోపు మండల న్యాయ సేవాధికార కమిటీకి దరఖాస్తు చేసుకోవాలన్నారు. సేవా దక్పథం కలిగిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

28న 'కాట్రేనికోన' మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-కాట్రేనికోన

మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 28వ తేదీన మంగళవారం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ శ్రీదేవి తెలిపారు. ఆమె శనివారం విలేకరులతో మాట్లాడుతూ ఎంపిపి పాలెపు లక్ష్మి అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశానికి ప్రజా ప్రతినిధులు, జెడ్‌పిటిసి సభ్యులు, ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు వివిధ శాఖల అధికారులు విధిగా హాజరుకావాలని కోరారు. సమావేశానికి హాజరయ్యే అధికారులు తమ శాఖలకు సంబంధించిన పూర్తిస్థాయి సమాచారంతో హాజరుకావాలని ఎంపిడిఒ కోరారు.

'అనూస్ సంస్థ' ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు

ప్రజాశక్తి-ఆత్రేయపురం

మండలంలోని ర్యాలి గ్రామంలో అనూస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శనివారం పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక మ్యాజిక్ హౌస్ వద్ద గ్రామానికి చెందిన వృద్ధులకు ఎండకు ఉపశమనం కలిగేలా ఫ్రూట్ జ్యూస్‌లు అందజేశారు. జగన్మోహిని కేశవ స్వామి ఆలయానికి వచ్చే సందర్శకులకు అల్పాహారం వందమంది పేదలకు భోజనం పార్సిల్స్ అందజేశారు. అలాగే ఎనర్జీ డ్రింక్‌ను పంపిణీ చేశారు. హైదరాబాదుకు చెందిన శక్తి గ్రూప్ అధినేత డిడి మనోహర్ కుమార్తె దీక్షిత పుట్టినరోజును పురస్కరించుకొని సమకూర్చిన వాటిని అనూస్ స్వచ్ఛంద సంస్థ పంపిణీ చేసింది. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు అన్నపూర్ణ, నాగ వీరమణి తదితరులు పాల్గొన్నారు.

'వాడపల్లి'కి పెరుగుతున్న కాలినడక యాత్రికులు


ప్రజాశక్తి-ఆలమూరు

వాడపల్లి వెంకటేశ్వర స్వామి ఆలయానికి కాలినడక వస్తున్న మొక్కుబడి యాత్రికుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. సుదూర ప్రాంతాలనుంచి వాహనాలు ద్వారా ఈ వాడపల్లికి చేరుకుంటున్న సంగతి తెలిసిందే. ఐయితే ఉమ్మడి గోదావరి జిల్లాల్లో చాలా మంది యాత్రికులు కాలినడకన వస్తామని మొక్కుకుంటున్నారు. ఆలమూరు, ఆత్రేయపురం, రావులపాలెం, కొత్తపేట మండలాల వారే గాక పరసర నల్లి, ఏజె కిలోమీటర్ల దూరం నుంచి కూడా యాత్రికులు నడిచివస్తున్నారు. కొంతమంది శుక్రవారం రాత్రికే ఆలయం వద్దకు చేరుకుంటున్నారు. మరి కొంత మంది శనివారం తెల్లవారు జామున బయలుదేరి కాలినడకన వెళు తున్నారు. ఆలమూరు మండలం బడుగువానిలంక మీదుగా గోదావరి పాయను దాటుకుని వాడపల్లి వచ్చే యాత్రికులు కూడా అధికంగా ఉంటారు. ఐయితే గోదావరి పాయను నీరు అంతగా లేకపోవడంతో ప్రాణాలు తీసే ఊబిలతో ప్రమాదాలు తెస్తున్నాయి. ఈ నెల 11న ఇలా నడిచి వాడపల్లి వెళ్తూ గోదావరి పాయ ఊబిలో చిక్కుకుని ఆలమూరు మండలం మడికి, చింతలపాడు గ్రామాలకు చెందిన ముగ్గురు మృతి చెందిన సంగతి తెలిసిందే. అందుకని ఈ ఊబులకు భయపడి సుదూరమైనప్పటికీ గోదావరిని నడిచి దాటకుండా రోడ్డుపైనే నడుచుకుంటూ వాడపల్లి చేరుకుం టున్నారు. ఈ క్రమంలోనే శనివారం కడియం మండలం కడియపులంక కు చెందిన సుమారు 25 మంది భక్తులు ఆ విధంగానే వెన్నెల, రావులపాలెం మీదుగా వాడపల్లి వెళుతూ ఆలమూరు మండలంలోని చొప్పెళ్ల సమీపాన జాతీయ రహదారిపై వెళుతూ 'ప్రజాశక్తి'కి తారసపడ్డారు. వాస్తవానికి వీరు గోదావరి నది దాటితే కేవలం ఐదు కిలోమీటర్ల దూరం లోనే వాడపల్లి వేరుకునే అవకాశం ఉంటుంది. ఐయినప్పటికీ సుదూరమైనా రోడ్డు మార్గం ద్వారానే నడిచి వెళుతున్నారు. ఈ విధంగా నడిచి వెళ్లి వాడపల్లి వెంకన్నకు మొక్కులు తీర్చుకుంటున్న యాత్రికుల ప్రతి శనివారం వేలాది ఉంటున్నారు.



వాడపల్లి నడిచి వెళుతున్న వెంకన్న యాత్రికులు

కార్టూన్ 'నిజం'



సుబ్బారావుకు డాక్టరేట్, కళారత్న అవార్డు ప్రదానం

ప్రజాశక్తి -కొత్తపేట

కవి, గాయకుడు, నటుడు, అధ్యాపకుడు, పాత్రికేయుడు రావులపాలెం మండలం గోపాలపురం గ్రామానికి చెందిన వివివిఎస్.సుబ్బారావు శనివారం గౌరవ డాక్టరేట్ తో పాటు భారత కళ రత్న అవార్డును అందుకున్నారు. సుబ్బారావుకు ఉన్న ప్రతిభను గుర్తించిన గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ ను భారత్ కళ రత్న పురస్కారాన్ని ప్రతిపాదించింది. ఈమేరకు చెన్నైలోని భారతీయ విద్యాభవన్‌లో గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ ఫౌండర్ ఛైర్మన్ పి.మాన్యుల్ ముఖ్య అతిథి హనరబుల్ జడ్జి కె.వెంకటేషన్, సైబర్ క్రైమ్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ డి.రంగరాజు, ఢిల్లీ మెట్రో రైల్ ఎలక్ట్రికల్ ఇంజినీర్ ఎస్. బాలసుబ్రమణ్యం తదితరుల చేతుల మీదుగా డాక్టరేట్‌తో పాటు భారత కళ రత్న పురస్కారాన్ని సుబ్బారావు అందు కున్నారు. ప్రయ వేటు కళ శాల్లో అధ్యాపకుడిగా 15 సంవత్సరాలుగా పనిచేస్తున్నారు. అందుకే గోపాల పురం నుంచి కొత్తపేట వచ్చి స్థిరపడ్డారు ఇప్పటికే ఆయన పలు నేషనల్ అవార్డులను పొందారు సుబ్బారావు కు డాక్టరేట్ రావడం పలువురు అభినందనలు తెలిపారు.



చెన్నైలో డాక్టరేట్, కళారత్న అవార్డు అందుకుంటున్న సుబ్బారావు

నేరాలు ఘోరాలు

యువకుని మృతిపై దర్యాప్తు

ప్రజాశక్తి-ఆత్రేయపురం

ఒక యువకుడు అనుమానాస్పద మృతి పై పోలీసులు దర్యాప్తును వేగవంతం చేశారు. వివరాల్లోకి వెళితే మండలంలోని. వెలిచేరు గ్రామానికి చెందిన కైరం నాగ శ్రీనివాస్(34) ఈనెల 22న ఇంటి నుండి సాయంత్రం బయటకు వెళ్లాడు. అయితే అతను ఈ నెల 23న ఉదయం వెలిచేరి వద్ద మధ్య డెల్టా కాలువ గట్టుపై విగతజీవిగా పడివున్నాడు. దీంతో అతనిని తండ్రి పోతురాజు స్థానిక పిఎంపి వద్దకు తీసుకువెళ్లగా పరీక్షించి అప్పటికే చనిపోయినట్లు నిర్ధారించాడు. ఈ ఘటనపై తండ్రి పోతురాజు తన కొడుకు ఆత్మహత్య చేసుకునేంత పిరికివాడు కాదని ఎవరో కావాలని హత్య చేసి ఉంటారని పోలీసులు ఫిర్యాదు చేశాడు. దీంతో తండ్రి ఫిర్యాదు మేరకు అనుమానస్పద మృతి గా కేసు నమోదు చేసిన పోలీసులు శ్రీనివాస్ ఫోన్ నెంబర్ నుంచి ఎవరికి ఫోన్ చేశారు. శ్రీనివాస్ కి ఎంతమంది ఆరోజు ఫోన్ చేశారు. అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. మృతుని ఒంటిపై గాయాలు లేకపోవడం. షర్టు తడిసి ఉండడం. ముఖమంతా శుభ్రంగా ఉండడంతో పలు అనుమానాలకు తావిస్తోంది. దీనిపై డాగ్ స్క్వాడ్ క్లూ టీమ్స్ కూడా వచ్చి పలు ఆధారాలను సేకరించినట్లు తెలుస్తుంది.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-ఆత్రేయపురం

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒక వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని పాటి చెరువుకి వెళ్లే ఆర్అండ్‌బి రోడ్డు సమీపంలో చోటు చేసుకున్న సంఘటనపై పోలీసు కేసు నమోదు చేశారు. వారి వివరాలు ప్రకారం పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మండలం జగన్నాథపురానికి చెందిన తాళ్ల సతీష్ కుమార్ (36) ట్యూషన్ మాస్టర్ గా పనిచేస్తున్నాడు. శనివారం తెల్లవారు జామున వాడపల్లి వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకునేందుకు ఇంటి వద్ద మోటార్ సైకిల్ పై బయలుదేరాడు. అయితే గుడికి వెళ్లే మార్గం మధ్యలో మండలంలోని పాటి చెరువు సమీపంలోకి వచ్చేసరికి ఆర్ అండ్ బి రోడ్డుపై ఎదురుగా వస్తున్న గుర్తు తెలియని వాహనం సతీష్‌కమార్ మోటార్‌సైకిల్‌ను ఢీకొంది. ఈ ఘటనలో అతనికి గాయాలు అయ్యాయి. వెంటనే అతనిని 108 లో రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వైద్యాధికారి పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. చిన్నాన్న ప్రసాదరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎస్.శ్రీనివాసు తెలిపారు

సారా కేసులో వ్యక్తికి రిమాండ్

ప్రజాశక్తి - గోపాలపురం

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సారా బట్టీపై దాడులు నిర్వహించి వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్ఐ కె.సతీష్‌కుమార్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు వాదాలకుంట గ్రామం శివారు తాడిపూడి పంట కాలువ గట్టు వద్ద అదే గ్రామానికి చెందిన గుబ్బల శ్రీను సారాబట్టీని నిర్వహిస్తున్నాడన్నారు. ఈ మేరకు సిబ్బందితో దాడి చేసి 10 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. రూ.20వేల విలువ గల 400 లీటర్ల బెల్లపు ఊట, సారా తయారీకి ఉపయోగించే సామగ్రిని ధ్వంసం చేశామని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి కొవ్వూరు కోర్టులో హాజరుపరిచామన్నారు. న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించామని తెలిపారు.

దొంగను పట్టుకున్న గ్రామస్తులు

ప్రజాశక్తి - యానాం

స్థానిక కనకాలపేట రామాలయంలో ఓ దుండగుడు శుక్రవారం అర్ధరాత్రి ఆలయ తలుపులు బద్దలు కొట్టి చోరీ చేస్తుండగా గ్రామస్తులు పట్టుకున్నారు. ఎవరూ లేని సమయంలో ఆలయ తలుపులు బద్దలు కొట్టి హుండీలో డబ్బులు దొంగతనం చేస్తుండగా పకడ్బందీగా పట్టుకున్నట్లు తెలిపారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించి, తనను పోలీసులకు అప్పగించామన్నారు. వెంటనే స్పందించిన పోలీసులకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

వర్షాలతో ఊరట.. అభ్యర్థుల్లో అలజడి

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

గత నెల రోజులుగా భానుడి ప్రతాపానికి అల్లాడిన ప్రజలకు ఈ వారాంతంలో మారిన వాతావరణం కాస్తంత ఊరట నిచ్చింది. పల్లెలు, పట్టణాలలో సామాన్య ప్రజానీకంతోపాటు పాడి రైతులు సైతం ఊపిరి పీల్చుకున్నారు. జీవాలకు ఊరట లభించిందనే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అల్పపీడన ద్రోణి తుపానుగా మారడంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురిసి వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. మరోవైపు నైరుతి రుతుపవనాలు ఒక్క రోజు ముందుగానే వస్తున్నట్లు వాతావరణ శాఖ ప్రకటించిన విషయం విదితమే. తాజా వర్షాల నేపథ్యంలో కోనసీమ, కాకినాడ జిల్లాల్లో రైతులకు ఇబ్బందులు తప్పలేదు. తూర్పు గోదావరి జిల్లాలో వరికోతలు ఈ నెల ప్రారంభంలోనే పూర్తవటంతో కొంత ఊరట లభించినట్లయింది. మిగిలిన రెండు జిల్లాల్లో కళ్లాల్లో ధాన్యాన్ని తరలించేందుకు రైతులకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సార్వత్రిక ఎన్నికల ప్రభావంతో కొనుగోలు లక్ష్యం చేరుకోవడంలో అధికార యంత్రాంగం విఫలమైంది. దీంతో రైతులు దళారులను ఆశ్రయించక తప్పడం లేదు. మారిన వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో మద్దతు ధరకు తక్కువగా ధాన్యం విక్రయించాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారించి రైతులకు అండగా నిలవాలని రైతులు, రైతు సంఘాలు విజ్ఞప్తి చేస్తున్నాయి. ఇంకో వైపు వర్షాలు ముందుగానే రావటంతో ఖరీఫ్ సాగుకు రైతులు సమాయత్తం అవటంతో సాగు సందడిమొదలైంది.



ఓట్ల లెక్కింపునకు రంగం సిద్ధం

సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపునకు రంగం సిద్ధమైంది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కోనసీమ, కాకినాడ, తూర్పు గోదావరి జిల్లా కేంద్రాలలో చక చకా ఏర్పాట్లు పూర్తవుతున్నాయి. ఈ నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లపై ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. కౌంటింగ్ సిబ్బందికి ఇప్పటికే అవగాహన కల్పించడంతో గడువు తేదీ రావటమే తరువాయి. మరోవైపు అభ్యర్థుల్లో సామాన్య ప్రజల్లోనూ ఉత్కంఠ నెలకొంది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వైసిపి, టిడిపి తరపున పోటీ చేసిన అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థులు సుమారు రూ.50 కోట్లతో మొదలై రూ.100 కోట్ల వరకూ వెచ్చించారు. పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థులు ఇక సరేసరి. రూ.100 కోట్లకుపైగానే ఖర్చు చేసినట్లు సమాచారం. ముఖ్యంగా జనసేనాని పవన్ కళ్యాణ్ పోటీ చేసిన పిఠాపురం నియోజకవర్గంలో అభ్యర్థుల ఖర్చు మరింత అదనమనే తెలుస్తోంది. ఈ నేపథ్యంలో గెలుపు ఓటముల మధ్య అభ్యర్థుల్లో టెన్షన్ మొదలైంది. ఓటర్లలోనూ ఫలితాలపై జోరుగా చర్చ మొదలైంది. ఏ పార్టీ అధికారంలోకి రాబోతోందనే ఉత్సుకత వ్యక్తమవుతోంది. అయితే స్పష్టత రావాలంటే మరో 10 రోజులు ఆగాల్సిందే.

ఆకాశాన్నంటుతున్న కూరగాయల ధరలు

కూరగాయల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. చిక్కుళ్లు కేజీ రూ.100 మార్కు దాటేసింది. మిర్చి కేజీ రూ.80కు చేరాయి. వంకాయలు, బీర, ఇతర ఏ రకమైనా కేజీ రూ.60 వెచ్చించాల్సిందే. బహిరంగ మార్కెట్లో కొనుగోలు చేయలేక రైతు బజార్లకు వెళ్లిన కొనుగోలు దారులకు నిరాశే మిగులుతోంది. కూరగాయల నాణ్యత లేకపోవటంతో రైతు బజార్ల లక్ష్యం నీరు కారుతోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారించి రైతు బజార్లలో నాణ్యమైన కూరగాయలు అందుబాటులో ఉంచేలా చర్యలు చేపట్టాలని కొనుగోలు దారులు కోరుతున్నారు.

అడ్మిషన్ల దందా షురూ

విద్యా సంవత్సరం ప్రారంభం నేపథ్యంలో ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లు, కాలేజీలలో అడ్మిషన్ల దందా మొదలైంది. ప్రభుత్వ నిబంధనలకు పూర్తిగా తూట్లు పడుతున్నాయి. ఎల్‌కెజి విద్యార్థికి కనీసంగా రూ.20,000 ఫీజులు వసూలు చేయడంతో పాటు పుస్తకాలు, బస్‌ఛార్జీల పేరుతో మరో రూ.10,000 యథేచ్ఛగా యాజమాన్యాలు వసూలు చేస్తున్నాయి. పదో తరగతి చదివించాలంటే పాఠశాలల స్థాయిని బట్టి రూ.50,000 నుంచి రూ.1,00,000 వెచ్చించక తప్పడం లేదు. ఇంటర్మీడియెట్ కాలేజీ ఫీజులు సైతం ఆకాశాన్ని తాకుతున్నాయి. నీట్, టార్గెట్ ఐఐటి తదితర పేర్లతో రూ.1,00,000 నుంచి రూ.1.50,000 చొప్పన వసూళ్లు జరుగుతోంది. ఉన్నతాధికారులు దృష్టి సారించి ఈ దోపిడీని అరికట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు.

తీవ్ర ఉక్కబోతతో ఆక్వాకు కష్టాలు

ప్రజాశక్తి-తాళ్లరేవు

నైరుతి పశ్చిమ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం, రెమాల్ తుపాను కారణంగా వాతావరణంలో తీవ్ర ఉక్కబోత వల్ల ఆక్వా రైతులు ఆందోళన చెందుతున్నారు. శుక్రవారం కుండపోత వర్షం కురిసినప్పటికి, శనివారం ఉదయం నుంచి వర్షం పడకుండా చిన్న చినుకు పడుతూ, గాలి స్తంభించి ఎండ రాకపోవడంతో రొయ్యల చెరువులకు ఆక్సిజన్ ప్రాబ్లం వచ్చి రొయ్యలు నీటిపై తేలుతూ ఈదడంవల్ల పలు చెరువుల్లో రొయ్యలు చనిపోతున్నాయి. దీంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. తాళ్లరేవు మత్స్య శాఖ అధికారి గోపి మాట్లాడుతూ ఇటువంటి ఉక్క బోత సమయంలో చెరువుల్లో ఏరియేటర్స్ నిరంతరం పని చేయాలని సూచించారు. వాటర్ క్వాలిటీని పరీక్షించి పిహెచ్ (ఉదజని) శాతం 7.5 నుంచి 8.5 ఉండేలా చూసుకోవాలన్నారు. ఉదజని సూచికలో ఆమ్ల, క్షార స్థాయి ఏ విధంగా ఉన్నాయో చూసి దానికి తగిన సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. ఎండ లేకపోవడం వల్ల ఫొటోసింథసిస్ (కిరణ జన్య సంయోగ క్రియ) జరగకపోవడంతో చెరువులకు ఆక్సిజన్ ప్రాబ్లం వస్తుందని తెలిపారు. ఇటువంటి సమయంలో ఏరియేటర్స్‌ను కంటిన్యూగా తిప్పాలని అన్నారు. ఏరియేటర్స్ లేని రైతులు నీరు తోడే మోటారు, డీజిల్ ఇంజన్ సాయంతో చెరువులో నీటిని పంపింగ్ చేయాలన్నారు. ఆ సదుపాయం లేని రైతులు వాటర్ బోటు, లేదా మేత పెట్టే తెప్ప సాయంతో చెరువులో కొద్దిసేపు తిరిగినా ఆక్సిజన్ లెవెల్స్ పెరుగుతాయని తెలిపారు. కౌంటింగ్ దశకు వచ్చిన రొయ్యలను కొంతమేర వేటాడి తీసివేసిన, చెరువులో డెన్సిటీ తగ్గి మరునాడు డిఒ రాకుండా ఉంటుందని తెలిపారు. ఈ చర్యలు చేపట్టి ఉక్క బోత నుంచి రొయ్యల చెరువులను కాపాడుకోవచ్చని అన్నారు. వాతావరణం రెండు రోజులపాటు ఇలానే ఉంటే ఆక్సిజన్ టాబ్లెట్లు అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు.



ఆక్వా చెరువుల్లో తిరుగుతున్న ఏరియేటర్స్

ఆధునిక విధానాలతో అధిక దిగుబడి

ప్రజాశక్తి - పెద్దాపురం

వ్యవసాయ రంగంలో వస్తున్న ఆధునిక వ్యవసాయ విధానాలపై అవగాహన పెంచుకోవడం ద్వారా రైతులు అధిక దిగుబడులు సాధించవచ్చని ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం రాజమహేంద్రవరం డీన్ రమణమూర్తి తెలిపారు. వడ్లమూరులోని కమ్యూనిటీ భవనంలో శనివారం రైతులకు నిర్వహించిన సదస్సుకు ఆయన అధ్యక్షత వహించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక వ్యవసాయ పరికరాలను వినియోగించడంలో రైతులు అవగాహన పెంచుకోవాలన్నారు. పలువురు వ్యవసాయ అధికారులు మాట్లాడుతూ వ్యవసాయ రంగానికి సంబంధించిన అనేక అంశాలపై, నాణ్యమైన విత్తనాల ఎంపికపై, ఎరువుల సద్వినియోగంపై, చీడపీడల నివారణపై, అధిక దిగుబడులు సాధించడంపై అవగాహన కల్పించారు. ఈ సదస్సులో గ్రామ రైతుల తరపున కంటే వీరరాఘవరావు పలు సమస్యలను అధికారులకు నివేదించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన స్టాల్స్ ద్వారా వ్యవసాయాధికారులు రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గోదావరి జోన్ అసోసియేట్ డీన్ ఆఫ్ రీసెర్చ్ శ్రీనివాస్, దయాకర్, ఉషారాణి, సుధీర్, సీతారామ శర్మ, వడ్లమూరు అగ్రికల్చర్ అసిస్టెంట్ శ్రీవాణి ప్రసంగించారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

వృద్ధులకు దుస్తుల పంపిణీ

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

రమణయ్యపేట ఎపిఐఐసి కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యాన రఘు సౌజన్యంతో శనివారం వృద్ధులకు నూతన వస్త్రాలు పంపిణీ జరిగింది. ఈ సందర్భంగా ఆధ్యాత్మికవేత్త రవిశంకర్ పట్నాయక్ మాట్లాడుతూ పరులకు చేతనైనంత మేరకు సేవలు అందిస్తే అంతకంటే మహత్కార్యం ఏముంటుందని ప్రశ్నించారు. పరోపకార గుణంతో జీవిస్తేనే జీవితం సార్థకం అవుతుందని అన్నారు. ఆ దిశగా సంపాదనలో కొంత శాతాన్ని సేవా కార్యక్రమాలకు వెచ్చిస్తున్న రఘు పేదలకు నూతన వస్త్రాలు సమకూర్చడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, రాజా, రాఘవరావు, చంద్రరావు, కుమార రాజా తదితరులు పాల్గొన్నారు.



అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో వస్త్రాల పంపిణీ



పిల్లలను గుర్తించిన అధికారులు

ప్రత్యేక అవసరాల పిల్లల గుర్తింపు

ప్రజాశక్తి -కరప

కరప మండలం వేళంగిలో ప్రత్యేక అవసరాలు గల పిల్లల కోసం చిల్డ్రన్ విత్ స్పెషల్ నీడ్స్ సర్వేను ఐఇఆర్‌పిలు నిర్వహించారు. శనివారం ఈ సర్వే అమలు తీరును పరిశీలించేందుకు సర్వ శిక్షాభియాన్ ఐఇ కోఆర్డినేటర్ చామంతి నాగేశ్వరరావు, ఎంఇఒ పి.సత్యనారాయణ సర్వేలో పాల్గొన్నారు. ఐఇఆర్‌పిలు, కన్నె స్వాతి, నురుకుర్తి మల్లీశ్వరికి సూచనలు సలహాలు అందించారు. వేళంగి గ్రామంలో మచ్చ వివేక్, తేజ ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తించినట్లు ఎంఇఒవ సత్యనారాయణ తెలిపారు. మండలంలో 18 ఏళ్లలోపు ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులను కరప మండల భవిత కేంద్రంలో తప్పనిసరిగా నమోదు చేసేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

పలుచోట్ల తడిచిన ధాన్యం

ప్రజాశక్తి-రామచంద్రపురం

అల్పపీడన ప్రభావంతో కొద్ది రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. వర్షాలకు రైతులు దాచుకున్న ధాన్యం తడిసిపోయింది. వర్షాలు మరింతగా కురుస్తాయన్న సమాచారంతో రైతుల అప్రమత్తమయ్యారు. ధాన్యం రాశులపై పలు రైతులు బరకాలు కప్పుకోగా, ఎగుమతులు వేగం పెంచారు. దీంతో ట్రాక్టర్ల పై తర్పాలిన్ కవర్లు కప్పి ధాన్యం మిల్లులకు ఎగుమతులు వేగంగా జరుగుతున్నాయి. ఇక మొదట్లో 75 కేజీల బొండల ధాన్యానికి రూ.1400 చెల్లించగా ప్రస్తుతం రూ.1600 చేరుకుంది. ధాన్యం ధర పెరగడంతో రైతులు ధాన్యాన్ని ఎగుమతులు చేస్తున్నారు. మరోవైపు రోడ్ల వెంబడి పోగు చేసుకున్న ధాన్యాన్ని రైతులు బరకాలు, టార్పాలిన్లు కప్పి జాగ్రత్త చేసుకుంటున్నారు.



వర్షానికి తడిసి మొలకెత్తిన ధాన్యం

పెరిగిన కూరగాయల ధరలు

ప్రజాశక్తి-రామచంద్రపురం

వర్షాలు ప్రారంభమై రెండు రోజులు గడవక ముందే కూరగాయల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. మొన్నటి వరకు కిలో రూ.30 నుంచి రూ.40 ఉండే పచ్చిమిర్చి ఒకేసారి కిలో రూ. 200 కు చేరింది. అదే బాటలో కొత్తిమీర మొన్నటి వరకు కిలో రూ.40 నుంచి రూ.50 మధ్య ఉండగా ప్రస్తుతం కిలో 200 అమ్ముతున్నారు. దీంతోపాటుగా బీరకాయలు కిలో రూ.100కు చేరగా, వంకాయలు, బెండకాయలు కూడా కిలో రూ.60 నుంచి రూ.80 మధ్య ధర పలుకుతున్నాయి. ఒక్క ఉల్లిపాయలు టమాటాలు తప్ప మిగిలిన అన్ని సరుకులు ధరలు పెరిగాయి. అల్లం ధర కూడా సామాన్యులకు అందుబాటులో లేదు. వాటి వెంటే ఆకుకూరల ధరలు కూడా రోజురోజుకు పెరుగుతున్నాయి. బయట మార్కెట్ ధరలను అదుపు చేసే యంత్రాంగం ప్రభుత్వానికి లేకపోవడంతో ధరలు నియంత్రణ లేకుండా పోయింది రైతులు వద్ద తక్కువ ధరలకే కొంటున్న దళారులు అధిక మొత్తంలో లాభాలు వేసుకుని సామాన్యుల నుంచి అధిక ధరలు వసూలు చేస్తున్నారు. సామాన్యులకు అందుబాటులో లేని ధరలు వీలైనంత వరకు తగ్గించేందుకు అధికారులు కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

వెంకన్న ఆదాయం రూ.35 లక్షలు

ప్రజాశక్తి-ఆత్రేయపురం

వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి వారికి వివిధ సేవల ద్వారా శనివారం రూ.35 లక్షల వరకు ఆదాయం సమకూరిందని ఆలయ డిప్యూటీ కమిషనర్ భూపతి రాజు కిషోర్ కుమార్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ స్వామివారికి వేకువ జామున సుప్రభాత సేవ, తొలి హారతి నిరాజనం మంత్రపుష్పం తదితర కార్యక్రమాల అనంతరం యాత్రికులకు దర్శనాలు కల్పించారన్నారు. తెలుగు రాష్ట్రాలు ఉండే కాకుండా ఇతర రాష్ట్రాన్ని కూడా అధిక సంఖ్యలో యాత్రికులు వచ్చి స్వామివారిని దర్శించుకున్నారని వచ్చిన యాత్రికులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు పూర్తిచేసి పర్యవేక్షించారు అలాగే శనివారం స్వామివారికి ప్రత్యేక దర్శనం, అన్నదానం, విరాళాలు, లడ్డువిక్రయం, తదితర సేవలు వల్ల రూ.35 లక్షలు వరకు ఆదాయం సమకూరిందని తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు, దొంగతనాలు జరగకుండా ఎస్ఐ ఎస్.శ్రీనివాస్ తన సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వచ్చిన యాత్రికులకు ప్రసాద వితరణ, భారీ స్థాయిలో అన్నదానం నిర్వహించారు.

మందేశ్వరస్వామి ఆదాయం రూ.2 లక్షల 27 వేలు

కొత్తపేట: మందేశ్వర స్వామి ఆలయములో స్వామివారికి తైలాభిషేకములు, పూజలు, ప్రసాద వితరణ ద్వారా రూ.2,02,770 ఆదాయం వచ్చినట్లు సహాయ కమిషనర్ మరియు ఇఒ కె.విజయలక్ష్మి శనివారం తెలిపారు మందేశ్వర స్వామికి తైలాభిషేకములు ద్వారా రూ.1,65,065, అన్న ప్రసాదం విరాళాలుగా రూ.37,705 ఆదాయం వచ్చిందని తెలిపారు. సుమారు 400 మంది పైబడి స్వామివారి అన్న ప్రసాదం స్వీకరించాలని తెలిపారు.

మరమ్మతు పనులతో ట్రాఫిక్ జామ్

ప్రజాశక్తి- సామర్లకోట

మండలంలని అచ్చంపేట, ఉండూరు సమీపంలో కాకినాడ నగరపాలక సంస్థకు చెందిన పైపులైన్ మరమ్మతు పనుల కారణంగా శనివారం ఎడిబి రోడ్డులో ట్రాఫిక్ రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అచ్చంపేట సమీపంలో కూలిన వంతెన వద్ద రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు వాటర్ పైప్‌లైన్ మరమ్మతులకు గురైంది. శుక్రవారం పైపులైన్ మరమ్మతు పనులను ప్రారంభించారు. శనివారం ఒకవైపు వర్షం పడుతుండగా మరోవైపు పైప్ లైన్ మరమ్మతులు చేస్తుండడంతో భారీ క్రేన్ల వల్ల ట్రాఫిక్ రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సామర్లకోట నుంచి కాకినాడ పోర్ట్ వైపు కాకినాడ పోర్ట్ నుండి సామర్లకోట వైపు భారీగా లారీలు కార్లు నిలిచిపోయాయి. సామర్లకోట నుంచి శశికాంత్‌నగర్ ఫిల్టరేషన్ ప్లాంట్‌కు వెళ్ళే ముడినీటి సరఫరా పైపులైన్‌కు లీకులు ఏర్పడ్డాయి. ఒకవైపు ఎడిబి రోడ్డు నాలుగులైన్ల రహదారి అభివృద్ధి పనులు మరోవైపు పైప్ లైన్ పనులతో వాహనాలు రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.



ఎడిబి రోడ్డులో నిలిచిపోయిన వాహనాలు

అచ్చంపేట వంతెన వద్ద పైప్‌లైన్ మరమ్మతులు



IN THE COURT OF THE IV ADDL. JUNIOR CIVIL JUDGE : KAKINADA
I.A. 547/2023; I.A. 548/2023 & I.A. 549/2023
O.S. 288/2020

Between:
DATLA SUGUNA DEVI ...Plaintiff
and
KEERTI VEKATESWARA RAO & OTHERS ...Defendants

పై నెంబరు దావాలో 3వ ప్రతివాది అయిన కీర్తి సాయి రాజేష్ అను మీకు శ్రీ కోర్టువారి ద్వారా ఎన్నిసార్లు దావా సమన్లు పంపిననూ మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టువారు మీ హాజరు నిమిత్తం **ది. 21-06-2024వ** తేదీకి వాయిదా వేసినారు. ఆ రోజు **ఉదయం గం. 10-30 ని॥లకు** పై కోర్టువారి ఎదుట మీరు స్వయంగా గానీ, మీ వకీలు ద్వారా గానీ హాజరయ్యి మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై దావా మీ పరోక్షమున తీర్మానించబడును.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వులు ప్రకారం)

కట్టా వేణు, అడ్వకేట్
దంటువారి వీధి, కాకినాడ.
సెల్: 98495 48272

కాకినాడ
ది.24-5-2024



విద్యాకానుక స్టాక్ పాయింట్‌ను తనిఖీ చేస్తున్న అధికారులు

పలు పాఠశాలల్లో ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి-గండేపల్లి

మండలంలో పలు పాఠశాల్లో డిఇఒ పి.రమేష్ శనివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో భాగంగా విద్యా కానుకకు సంబంధించి మల్లేపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్ స్టాక్ పాయింట్‌ను తనిఖీ చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ విద్యా సంవత్సరం ప్రారంభం రోజునే ప్రతి ఒక్క విద్యార్థికీ విద్యా కానుక కిట్లు అందరికీ అందేలా చర్యలు తీసుకోవాలని ఎంఇఒ కెహెచ్.నాయక్‌ను సూచించారు. నాడు-నేడు పనులకు సంబంధించి జెడ్‌పి హైస్కూల్ హెచ్‌ఎం జి.సుధా మాధురి వారిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. త్వరగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. విద్యార్థుల పట్ల, విద్యా బోధన పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆయన వెంట ఎంఇఒ కెహెచ్.నాయక్, కె.వెంకటరెడ్డి ఉన్నారు.

కౌంటింగ్ ప్రక్రియపై సిబ్బందికి అవగాహన

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జూన్ 4వ తేదీన జరగనున్న కౌంటింగ్ ప్రక్రియకు సంబంధించి సంబంధిత సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాకినాడ రూరల్ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి ఇట్ల కిషోర్ మాట్లాడుతూ కౌంటింగ్ ప్రక్రియకు సంబంధించి ముఖ్యంగా సిబ్బంది పూర్తిగా అప్రమత్తతో వ్యవహరించాలన్నారు. ఇవిఎం లెక్కింపు పోస్టల్ బ్యాలెట్ లెక్కింపును సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. కౌంటింగ్ సందర్భంగా సెల్‌ఫోన్‌లు అనుమతించబోరని తెలిపారు. రాజకీయ పార్టీ ప్రతినిధులు, కౌంటింగ్ సిబ్బంది ఈ విషయాన్ని గుర్తించాలన్నారు. సమావేశంలో సహాయ రిటర్నింగ్ అధికారులు బి.విజయప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అయోడిన్ లోపంతో థైరాయిడ్ సమస్య

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

థైరాయిడ్ మెడ ముందు భాగంలో సీతాకోకచిలుక ఆకారంలో ఏర్పడుతుందని, అయోడిన్ లోపం థైరాయిడ్ సమస్యకు ప్రధాన కారణమని డాక్టర్ సువర్ణ రాజు పేర్కొన్నారు. రమణయ్యపేట ఎపిఐఐసి కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రపంచ థైరాయిడ్ నివారణ దినోత్సవం పురస్కరించుకుని జరిగిన అవగాహన కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. థైరాయిడ్ సమస్య వల్ల బరువు పెరగడం లేదా తగ్గడం, నిద్రలేమి, గుండె వేగంగా కొట్టుకోవడం, ఉద్వేగం, చర్మం పొడిబారడం వంటి లక్షణాలు కనబడతాయని అన్నారు. పెద్దవారిలో జీవ క్రియలను థైరాయిడ్ హార్మోన్లు నియంత్రిస్తాయని అన్నారు. ఇలా అన్ని దశలలో థైరాయిడ్ చాలా కీలకమని అన్నారు. అయోడిన్ కలిగిన ఉప్పును ఉపయోగించాలని, నూనె పదార్థాలను పరిమితంగా తీసుకోవాలని, తప్పనిసరిగా వ్యాయామం చేయాలని డాక్టర్ సువర్ణ రాజు తెలిపారు. కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, సిహెచ్. వెంకట్రావు, శిరీష తదితరులు పాల్గొన్నారు.

3 వేల మందికి అన్నదానం

ప్రజాశక్తి-రామచంద్రపురం

శివల గ్రామం లో శనివారం 3 వేల మందికి అన్నదానం నిర్వహించారు. ఇక్కడ గల శ్రీవేంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవాల్లో భాగంగా చివరి రోజు గ్రామస్తుల సహకారంతో అన్నదానం నిర్వహించారు. శివల, గుడిగల్ల తదితర గ్రామాల నుంచి ప్రజలు తరలివచ్చారు. కార్యక్రమం లో ఇళ్ళ సూర్య నారాయణ, వీరబ్రహ్మం తదితరప్రముఖులు పాల్గొన్నారు.

దస్తావేజు పోయినది

బచ్చు కళ్యాణ్‌కుమార్, తండ్రి: కోట నాగ బ్రహ్మం (లేటు) అను నాకు పిఠాపురం మండలం లక్ష్మీ నరసాపురం గ్రామంలో డోర్ నెం. 4-75లో 194 చ॥గు॥ ఖాళీ నివేశన స్థలము కలదు. గుత్తుత్తి అర్జునరావు గారి భార్య గుత్తి సత్యవతి గారి వద్ద నుండి కొన్న స్థలము యొక్క రెండు లింకు దస్తావేజులు 1647/1993 మరియు 511/2007 లను ది. 15-5-2024 తేదీ నాడు నా ద్విచక్ర వాహనంలో ఒక కవరులో పెట్టుకుని లక్ష్మీ నరసాపురం గ్రామం నుండి బ్యాంకు పనిపై పిఠాపురంలో విశాఖ కో-ఆపరేటివ్ బ్యాంకు వద్దకు వెళ్ళగా సదరు దస్తావేజులు పెట్టిన కవరు మార్గ మధ్యలో ఎక్కడో పడిపోయినది. చుట్టుప్రక్కల ఎంత వెతికినా దొరకలేదు. దొరికినవారు ఈక్రింది చిరునామాలో అందజేయగలరు.

బచ్చు కళ్యాణ్‌కుమార్
తండ్రి: కోట నాగబ్రహ్మం (లేటు)
లక్ష్మీ నరసాపురం గ్రామం, పిఠాపురం మండలం
కాకినాడ జిల్లా, సెల్: 9848882143

దస్తావేజు పోయినది

కాకినాడ జిల్లా, పెద్దాపురం మండలం, కొండపల్లి గ్రామ కాపురస్తులు కట్టుబోయిన శ్రీను, S/o. వీర వెంకన్న అయిన నేను ది. 15-3-2024వ తేదీన కొండపల్లి గ్రామం నుండి పెద్దాపురం వెళుతుండగా మార్గ మధ్యలో నా యొక్క లింకు దస్తావేజు పోయినది. నా స్థలం లింకు దస్తావేజు నెం. 576/1957. నా స్థలం దస్తావేజు నెంబర్ 4053/2021, సర్వే నెం. 497. ఎవరికైనా దొరికినచో ఈక్రింది అడ్రసుకు తెలియజేయగలరు.

కట్టుబోయిన శ్రీను
S/o. వీర వెంకన్న
కొండపల్లి గ్రామం, పెద్దాపురం మండలం
సెల్: 8688291678

పాస్‌పోర్టు పోయినది

తూర్పుగోదావరి జిల్లా, నిడదవోలు పట్టణానికి చెందిన బోక్కు శివసాయి, S/o. సత్తిబాబు అను నేను భారత ప్రభుత్వ పాస్‌పోర్టు కార్యాలయం నుండి **P9977996** నెంబరుతో పాస్‌పోర్టు పొందియున్నాను. ది. 16-5-2024వ తేదీన సదరు ఒరిజినల్ పాస్‌పోర్టు తీసుకుని జిరాక్స్ తీయించుట కొరకు మా ఇంటి దగ్గర నుండి నిడదవోలు బస్ స్టాండుకు వెళ్ళుచుండగా ఈ పాస్‌పోర్టు పడిపోయినది. దొరికినవారు ఈ అడ్రసుకు, ఫోన్ నెంబరుకు తెలియజేయగలరు.

బోక్కు శివసాయి
S/o. సత్తిబాబు, డోర్ నెం. 13-4-1/2
రామాలయం దగ్గర, రాయిపేట
నిడదవోలు, తూ॥గో॥జిల్లా
సెల్: 9949481141